



అమలాపురంలో శిబిరం వద్దనే నిద్రిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో...

నేడు అమలాపురంలో ముత్యాల ముగ్గుల పోటీలు

అమలాపురం, జనవరి 6 (ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని నల్లవంతెన దిగువన కలెక్టర్ కార్యాలయం పక్కన గల జీఎంసీ బాలయోగి స్టేడియంలో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యా సంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" ఈ నెల 7వ తేదీ ఆదివారం జరగనున్నాయి. జిల్లా పోటీలకు స్పాన్సరర్‌గా అమలాపురానికి చెందిన టీడీపీ అమలాపురం పార్లమెంటరీ ఇన్‌చార్జి జీఎం హరీష్ బాలయోగి వ్యవహరిస్తున్నారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు ముత్యాల ముగ్గుల పోటీలు ప్రారంభమవుతాయి. జిల్లా నలుమూలల నుంచి మహిళలు ఈ పోటీల్లో పాల్గొనవచ్చు. విజేతలైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల వారికి రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు చొప్పున నగదు బహుమతులు ఉంటాయి. పోటీల్లో పాల్గొనే మహిళలు పేర్ల నమోదుకు 99854 11256, 99854 11015 నెంబర్లను సంప్రదించగలరు. నేరుగా పోటీల కేంద్రానికి వచ్చి కూడా పేర్లు ఇచ్చి పోటీలో పాల్గొనవచ్చు..



సంఘీభావం ప్రకటిస్తున్న ఎమ్మెల్సీ ఐవీ, స్టాలిన్ తదితరులు



అంగన్‌వాడీ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు

అంగన్‌వాడీల 24 గంటల దీక్ష

- డిమాండ్ల సాధనకు తాడోపేడో..
- శిబిరాల వద్దనే చలిలో నిద్ర
- పలు సంఘాల నాయకుల సంఘీభావం

అమలాపురం టౌన్, జనవరి 6: అంగన్‌వాడీలకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోవడంతో కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు 24 గంటలు చొప్పున నిరాహార దీక్షకు దిగారు. తొలిరోజు దీక్షలో అమలాపురం, రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రతినిధులు నిరాహార దీక్షలో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు (ఐవీ), జనవిజ్ఞానవేదిక రాష్ట్రశాఖ గౌరవాధ్యక్షుడు చెలికాని స్టాలిన్‌లు పాల్గొన్నారు. నిరాహార దీక్షలో అంగన్‌వాడీల సంఘ జిల్లాశాఖ అధ్యక్షురాలు బి.వెంకటలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి, జిల్లా కోశాధికారి పి.అమూల్య, ప్రాజెక్టు కార్యదర్శులు కె.బేబీగంగారత్నం, దుర్గమ్మ, వెంకటలక్ష్మి, కోశాధికారి రత్నకుమారితో పాటు కె.పరిపూర్ణ, ఎ.కనకదుర్గ, ఎంవీవీ లక్ష్మి, ఎస్.ప్రశాంతి, పి.భారతితో సహా 30 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు దీక్షలో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు పెచ్చెట్టి విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి అధికారి జయవెంకటలక్ష్మి, మండల శాఖ అధ్యక్షుడు దెందుకూరి సత్తిబాబురాజు, పరమట శ్యామ్‌లు సందర్శించి సంఘీభావం తెలిపారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల సుభాషిణి, నాయకులు వడ్డి నాగేశ్వరరావు, కుడుపూడి శ్రీనివాస్, వంటెద్దు బాబి, గెడ్డం సురేష్‌బాబులతో పాటు జనసేన పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి డీఎంఆర్ శేఖర్, నాయకులు యేడిద శ్రీను, లింగోలు పండు, ఇసుకపట్ల రఘుబాబు తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు. దీక్షా శిబిరాన్ని సీఐటీయూ నాయకులు కారెం వెంకటేశ్వరరావు, గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్‌లు పర్యవేక్షించారు.

ఓట్ల కోసమే హామీలిచ్చావా : ఎమ్మెల్సీ ఐవీ

ఉద్యోగులకు అది చేస్తాను ఇది చేస్తాను అంటూ ఇచ్చిన హామీలన్నీ ఓట్ల కోసమేనా అని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) సీఎం జగన్‌ను సూటిగా ప్రశ్నించారు. సీఎం జగన్ పాదయాత్రలో భాగంగా ఉద్యోగులకు వివిధ స్కీముల్లో పనిచేస్తున్న వర్కర్లకు ఇచ్చిన హామీలు గుర్తున్నాయా అని ప్రశ్నించారు. ఉద్యోగులు, అంగన్‌వాడీలు, న్యాయవాదులతో పాటు ఎన్నో వర్గాల వారు ఆందోళనలకు దిగినా ప్రభుత్వంలో మాత్రం చలనం లేదన్నారు. నాలుగున్నరేళ్ల పాలనా వైఫల్యం వల్లే అన్ని వర్గాల్లో అసంతృప్తి పెరిగిపోయిందని జగన్ పాలనా తీరును విమర్శించారు. రాజకీయంగా గద్దెనెక్కడం కోసమే అంగన్‌వాడీలకు హామీలు ఇచ్చావా లేక నిజాయితీగా ఇచ్చావా ఒక్కసారి పరిశీలన చేసుకోవాలని జగన్‌ను హెచ్చరించారు. సీఎం జగన్ మాట్లాడితే నా ఎస్సీలు, నా బీసీలు, నా ఎస్టీలు అంటారు తప్ప ఇప్పుడు రోడ్డెక్కి ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలంతా ఆయా కులాలకు చెందిన వారేనని గుర్తించుకోవాలన్నారు. కులాలను, మతాలను, రాజకీయంగా వాడుకోవడమే తప్ప వారికి చేసిందేమీ లేదన్నారు. 16 వేల పోలీసు ఉద్యోగాలు, 50 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేసి ఉంటే ప్రభుత్వ ఆదాయం ఎంతో కొంత పెరిగి ఉండేదన్నారు. ఉద్యోగ, ఉపాధి కల్పన లేకపోవడంతో అప్పు రూ.12 లక్షల కోట్లకు చేరిపోయిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా అని ఆయన ప్రశ్నించారు.

ఎస్మా ప్రయోగం దారుణం

అమలాపురం టౌన్, జనవరి 6: అంగన్‌వాడీలకు సీఎం జగన్ ఇచ్చిన హామీలను అమలు చేయమంటే అణిచివేత చర్యలు ఏమిటని పీడీఎఫ్ ఎమ్మెల్సీ యిళ్ల వెంకటేశ్వరరావు(ఐవీ) ప్రశ్నించారు. విద్యుత్, వైద్యం, రవాణాతో పాటు తాగునీటి సరఫరా అత్యవసర సర్వీసులు కాగా అందులో ఐసీడీఎస్‌ను కూడా చేర్చి జగన్ ప్రభుత్వం జీవో నంబరు 2 తీసుకు రావడం అప్రజాస్వామికమన్నారు. అమలాపురం పట్టణంలోని యూటీఎఫ్ హోంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సమ్మెను అణిచివేసేందుకు ఎస్మాను ప్రయోగించడం పట్ల పీడీఎఫ్‌తో పాటు కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతి రేకిస్తున్నాయన్నారు. సమ్మె చేస్తున్న వారి సమస్యలు పరిష్కరించకుండా సమ్మెను అణిచివేయడం దుర్మార్గ మన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అంగన్ వాడీలు నిరవధిక సమ్మె చేస్తుంటే సీఎం జగన్ ఇంత వరకు జోక్యం చేసుకోలేదని విమర్శించారు. కార్మిక సంఘాలతో సమావేశమవుతున్న మంత్రులకు మాత్రం అధికారాలు లేకపోవడంతో వారు ఏమీ చేయలేకపోతు న్నారన్నారు. కార్మిక సంఘాల ఆధ్వర్యంలో త్వరలోనే జైల్‌భరో కార్యక్రమం కుడా నిర్వహిస్తారన్నారు.

ప్రభల తీర్థం ఏర్పాట్లపై సమీక్ష



వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఆర్డీవో

అంబాజీపేట, జనవరి 6: కనుమ సందర్భంగా అంబాజీపేట మండలం మొసలపల్లి శివారు జగ్గన్నతోటలో ఈ నెల 16వ తేదీన నిర్వహించే ప్రభల తీర్థానికి సౌకర్యాలు ఏర్పాటు చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కొత్తపేట ఆర్డీవో ఎం.ముక్కంటి సూచించారు. అంబాజీపేట మండలం గంగలకుర్రు పంచాయతీ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నాగపద్మలక్ష్మి అధ్యక్షతన శనివారం ఏకాదశ రుద్రులు ఉత్సవ కమిటీ సభ్యులు, ట్రస్ట్ చైర్మన్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తొలుత ఆయా గ్రామాల నిర్వాహకులు మాట్లాడుతూ ప్రభల తీర్థంలో మొబైల్ టాయిలెట్స్, తాగునీరు, ట్రాఫిక్ ఆంక్షలు విధించాలని సూచించారు. అనంతరం ఆర్డీవో మాట్లాడుతూ తీర్థంలో సౌకర్యాలు ఏర్పాటు చేసే విధంగా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ముమ్మరంగా పారిశుధ్య పనులు, జంగిల్ క్లియరన్స్‌తో పాటు ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే భక్తులకు వాటర్ ప్యాకెట్స్ అందించేందుకు ఆయా పంచాయతీల నుండి నిధులు అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పద్మనాభం కోరారు. తీర్థానికి తీసుకువచ్చే ప్రభలకు అడ్డువచ్చిన విద్యుత్ తీగలను తొలగించాలని ఆయా కమిటీ నిర్వాహకులు విద్యుత్‌శాఖ డీఈ జి.అన్నవరంను కోరారు. అలాగే పారిశుధ్య ఏర్పాట్లకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఎంపీడీవో కె.సత్యనారాయణమూర్తికి ఆర్డీవో సూచించారు. ఈ సమావేశంలో డీఎల్‌డీవో ఎం.ప్రభాకర్, ఏపీడీ డి.రాంబాబు, డివిజనల్ వైద్యాధికారి సుమలత, ఆర్‌అండ్‌బీ డీఈ రాజేంద్ర, ఎస్ఐ చైతన్యకుమార్, ట్రస్ట్ చైర్మన్ జయంతి భాస్కరసుబ్రహ్మణ్యం, సర్పంచ్‌లు కాండ్రేగుల శ్రీనివాసరావు, దొంగ నాగేశ్వరరావు, అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న ఆలయం కిటకిట



స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు



ఆత్రేయపురం, జనవరి 6 : కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామునే స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల ఫలపుష్పాలతో స్వామివారి ఆలయాన్ని అలకరించారు. ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలబోగం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ రాష్ట్రాల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు స్వామివారి తిరు వీధులలో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తులాభారాలు, తలనీలాలు, కానుకలు సమర్పించారు. వివిధ సేవల ద్వారా స్వామి వారి ఒక్కరోజు ఆదాయం రూ.24.78 లక్షలు లభించినట్టు చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

యానాంలో ఘనంగా ప్రజా ఉత్సవాలు





ఫలపుష్ప ప్రదర్శనను తిలకిస్తున్న మల్లాడి కృష్ణారావు



7లో

చంద్రబాబు సభకు తరలిరావాలి

20న మండపేటలో భారీ బహిరంగ సభ

అమలాపురం టీడీపీ ఇన్‌చార్జి అయితాబత్తుల



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

అమలాపురం టౌన్, జనవరి 6: టీడీపీ అధినేత చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన రా.. కదిలిరా.. బహిరంగ సభలను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని టీడీపీ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి అయితాబత్తుల ఆనందరావు పిలుపునిచ్చారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు స్వగృహం వద్ద శనివారం జరిగిన సమావేశంలో ఆనందరావు మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ దుర్మార్గపు పాలన సాగుతుందని, యువతతో పాటు అన్నివర్గాల ప్రజలను మోసం చేసిన ఘనుడిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. ఉద్యోగులు ఆందోళనలు అరణ్య రోదనలుగా మిగిలిపోయాయన్నారు. మట్టి, ఇసుకను సైతం దోచుకుతినే దౌర్భాగ్యపు పాలన సాగుతుందన్నారు. రా.. కదలిరా.. మహాసభల్లో భాగంగా ఈ నెల 20వ తేదీన అమలాపురం పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మండపేటలో భారీ బహిరంగ సభ జరుగుతుందన్నారు. జగన్ చేసిన మోసాలను ఆయా సభల ద్వారా ప్రజల ముందు ఉంచుతామన్నారు. బీసీలకు సీఎం జగన్ చేసిన అన్యాయంపై పోరాటం సాగిస్తామన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడ స్వామినాయుడు, తెలుగు మహిళ జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెచ్చెట్టి విజయలక్ష్మి, అధికారి జయవెంకటలక్ష్మి, నాయకులు దెందుకూరి సత్తిబాబురాజు, తిక్కిరెడ్డి నేతాజీ, కర్రి రామస్వామి, కుంచే వెంకన్నబాబు, వలవల శివరావు, భాస్కర్ల రామకృష్ణం, గంధం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యానాంలో బోటులో అగ్నిప్రమాదం

మంటలు ఆర్పే ప్రయత్నంలో బోటు యజమాని తమ్ముడు సజీవదహనం 7లో

రాజమహేంద్రవరంలో ఘనంగా ఏబీఎన్ ఆంధ్రజ్యోతి

ముత్యాల ముగ్గులపోటీలు



బహుమతుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న టీడీపీ నేత ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 6: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం జేఎన్ రోడ్డు సమీపంలోని షిరిడిసాయి జూనియర్ కళాశాల గ్రౌండ్స్‌లో "ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు... పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు... రియల్ పార్టనర్ స్వర్గసీమ సుకేతన" శనివారం వైభవంగా జరిగాయి. జిల్లా స్థాయిలో జరిగిన ఈ పోటీలకు లోకల్ స్పాన్సరర్‌గా ఆదిరెడ్డి భవాని చారిటబుల్ ట్రస్ట్ వ్యవహరించింది. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి బీహెచ్‌వీ మంగేష్ అధ్యక్షత వహించగా, భవాని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు, టీడీపీ నేత ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం తొలి మహిళా మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, షిరిడిసాయి విద్యా సంస్థల డైరెక్టర్ టి శ్రీవిద్య, ఆంధ్రజ్యోతి బ్రాంచి మేనేజర్ ఎస్ శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదు బహుమతులు అందజేశారు. అలాగే కన్సొలేషన్ బహుమతులు మరో 12 మంది మహిళలకు అందజేయగా, పాల్గొన్న అందరికీ గిఫ్ట్‌లను అందించారు.



రాజమహేంద్రవరంలో షిర్డీసాయి జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ముగ్గుల పోటీలు

అలరించిన తెలుగు తోరణం

రాజానగరం/దివాన్‌చెరువు, జనవరి 6: అంతర్జాతీయ తెలుగు మహాసభలను పురస్కరించుకుని రాజమహేంద్రవరంలోని గైట్ కళాశాలల ప్రాంగణంలో గైట్ విద్యార్థులు శనివారం రాత్రి ప్రదర్శించిన తెలుగు తోరణం నృత్యం రూపకం ఆద్యంతం ఆకట్టుకుంది. విద్యార్థులు చేసిన అద్భుతమైన ప్రదర్శనలు అందరినీ మంత్ర ముగ్ధులను చేశాయి. తెలుగు జాతి ఔన్నత్యం, తెలుగు వారి గొప్పతనాన్ని చాటిచెప్తూ మహనీయులందరినీ స్మరిస్తూ తెలుగు తోరణం నృత్య ప్రదర్శన సాగింది. విద్యార్థులు, ప్రేక్షకులు ఉరకలేసే ఉత్సాహంతో కేరింతలు కొడుతూ ఉర్రూతలూగారు. ఆదికవి నన్నయ మొదలుకుని స్వాతంత్ర్య సంగ్రామంలో తెలుగువారి పాత్ర స్వాతంత్ర్యం అనంతరం వివిధ పదవులతో కీర్తి తెచ్చిన తెలుగువారు, తమ కృతులు, కీర్తనలతో ఖ్యాతి తెచ్చిన త్యాగయ్య, అన్నమయ్య, రామదాసు తదితరులతో పాటు సాహిత్యంలో కీర్తిప్రతిష్ఠలను ఇనుమడింపజేసిన మహనీయులు, రంగస్థల నటులు, హరికథలు, బుర్రకథలతో ఖ్యాతిగాంచినవారు, సినీ నటులు, రచయితలు, శ్రీకృష్ణదేవరాయుల కొలువు అన్ని కోణాలను, అన్ని రంగాల్లో వన్నె తెచ్చిన తెలుగువారిని స్పృశిస్తూ వారి గురించి వివరిస్తూ సాగిన ఈరూపకం అందరినీ కట్టిపడేసింది. సినీ రచయిత రసరాజు రచించిన ఈ నృత్య రూపకానికి ఘంటసాల పవన్‌కుమార్ నృత్య దర్శకత్వం వహించారు. దాదాపు గంటపాటు సాగిన ఈ ప్రదర్శనకు గజల్ శ్రీనివాస్ గానం, సంగీతం అందించడంతో పాటు దర్శకత్వం వహించారు. ఈ నృత్యాన్ని వీక్షించిన ప్రముఖుల్లో గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్‌రాయ్, ఆంధ్రప్రదేశ్ తెలుగు సంస్కృత అకాడమీ అధ్యక్షురాలు లక్ష్మీపార్వతి, రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, పీఎన్‌బీ హైదరాబాదు జోనల్ మేనేజర్ డీకే శ్రీవాత్సవ తదితరులున్నారు. ప్రదర్శన అనంతరం ప్రేక్షులు తమ స్థానాల్లో నుంచి లేచి నిలుచుని చేసిన కరతాళ ధ్వనులతో కళాశాల ప్రాంగణం మార్మోగిపోయింది.

పులకించిన హృదయాలు



నృత్యరూపకం వీక్షిస్తున్న ప్రముఖులు



తెలుగు తోరణం నృత్యరూపకం ప్రదర్శిస్తున్న విద్యార్థులు









ప్రధాన వేదికపై సాంస్కృతిక ప్రదర్శనలు

సాంస్కృతిక ప్రదర్శనల కోలాహలం

అంతర్జాతీయ తెలుగు మహాసభలు

రాజానగరం, జనవరి 6: ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యాసంస్థల సంయుక్త ఆధ్వర్యంలో గైట్ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న 2వ అంతర్జాతీయ తెలుగు మహాసభల వేడుకల్లో విద్యార్థులు చేస్తున్న పలు సాంస్కృతిక ప్రదర్శనల్లో తెలుగుదనం ఉట్టిపడుతోంది. కవితా పఠనం, కవి సమ్మేళనాలు, పద్య, గద్య ఆలాపనలతో గైట్ ప్రాంగణం మార్మోగిపోతోంది. రెండో రోజు శనివారం రాజరాజ నరేంద్ర వేదికపై లిటిల్ పారడైజ్ స్కూల్, రవీంద్రభారతి విద్యాలయం, అన్నదేవరపేట ఏపీజే అబ్దుల్ కలాం స్కూల్‌తోపాటు పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు తెలుగు భాష, తెలుగుదనం చాటిచెబుతూ చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అబ్బురపర్చాయి. కార్టూనిస్ట్ శేఖర్ తదితరులు కార్టూన్ల ప్రదర్శన, ప్రధాన ప్రాంగణంలో శిల్పి రాజ్‌కుమార్ వడయార్ ఏర్పాటుచేసిన తెలుగుజాతి కీర్తిని పెంచిన వివిధ రంగాల మహనీయుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే నన్నయ వేదికపై బాలసాహిత్యం, భక్తి సాహిత్యంపై సదస్సులు వినసొంపుగా సాగుతున్నాయి. వెయ్యిమంది కవులు కవితా నీరాజనంలో భాగంగా నారాయణ భట్టు వేదికపై కవితా పఠనం వీనులవిందుగా జరుగుతున్నాయి. పలువురు ప్రముఖులు వేదపండితులు, వేలాదిమంది విద్యార్థుల కోలాహలంతో సందడి నెలకొంది.

ఫిబ్రవరి 16 నుంచి అంతర్వేది ఉత్సవాలు

సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

అంతర్వేది, జనవరి 6: రాష్ట్రస్థాయి అంతర్వేదికగా లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు నిర్వహించాలని అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి అన్నారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం షెడ్డులో ఏర్పాటుచేసిన వార్షిక ఉత్సవాల మొదటి సమీక్షా సమావేశం అమలాపురం ఆర్డీవో అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో శనివారం జరిగింది. తొలుత ఫిబ్రవరి 16నుంచి 25వరకు నిర్వహించే ఉత్సవాల్లో అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని ఆర్డీవో అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాల ఏర్పాట్లతో ప్రతి ఒక్కరూ తమ విధులు నిర్వహిస్తూ ప్రతీ భక్తునికి స్వామివారి కల్యాణంతోపాటు దర్శనం చేసుకుని సురక్షితంగా ఆధ్యాత్మిక భావంతో ఇంటికి వెళ్లాలన్నారు. కల్యాణం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవం వంటి ప్రధాన ఘట్టాలపై సమీక్షించారు. అనంతరం డీసీ విజయరామరాజు మాట్లాడుతూ ఉత్సవాలను ఉత్సాహంగా డ్యూటీ కోసం కాకుండా భక్తి సేవా దృక్పథంతో చేయాలని వివిధశాఖల అధికారులతో మాట్లాడారు. ఆలయ ప్రాంగణంలో జరిగే కల్యాణం, దర్శనాలకు భక్తులకు ఎక్కడ అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. రథోత్సవం సమయంలో పోలీసు బందోబస్తుతో రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు లేకుండా వాహనాలు అడ్డులేకుండా చూడాలన్నారు. చక్రస్నానం, తెప్పోత్సవాలపై ఫిషరీస్ అధికారులతో మాట్లాడారు. విద్యుత్ అధికారులతో మాట్లాడుతూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచే విద్యుత్ అంత రాయం లేకుండా చూడాలన్నారు. కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ మాట్లాడుతూ పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్ల మధ్య స్వామివారి కల్యాణోత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు మాట్లాడుతూ పారిశుధ్య చర్యలతోపాటు, వైద్య శిబిరాలు నిర్వహించి స్కౌట్ విద్యార్థులను స్వచ్ఛంద సేవాదళ్ ఏర్పాటుపై మాట్లాడారు. రూ.17కోట్లతో నిర్మితమవుతున్న స్థానిక పంచాయతీ చెరువులో ఈ సంవత్సరం తెప్పోత్సవం నిర్వహించడానికి వీలుండదని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు తెలపగా ఆర్డీవో కేశవర్ధనరెడ్డి స్పందిస్తూ అధికారులు, స్థానికులతో చివరి ఘట్టమైన తెప్పోత్సవాన్ని ఎలా నిర్వహించాలనేది తదుపరి సమావేశానికి సిద్ధం చేయాలన్నారు. కొంతమంది వశిష్ఠ గోదావరిపై తెప్పోత్సవాన్ని నిర్వహిస్తే బాగుంటుందని సూచించగా సానుకూలంగా స్పందించారు. ఆర్టీసీ బస్సులు, రోడ్లు, వసతి గదులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజాబహదూర్, ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, నెడ్‌క్యాప్ పాటి శివకుమార్, రాజోలు సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము, ఎంపీటీసీ బైరా నాగరాజు, చొప్పల బాబూరావు, సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఈవో బి.వెంకటేశ్వరరావు, తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, తహసీల్దార్ రమాకుమారి తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల నిర్వహణపై కళ్యాణం మండప ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవోతో పాటు డీసీ విజయరామరాజు, అధికారులు

ముందస్తు పరిశీలన..

అమలాపురం ఆర్డీవో జి.కేశవర్ధనరెడ్డి ఆలయ అధికారులతో కలిసి కళ్యాణ ప్రదేశం, రథోత్సవం, చక్రస్నానం, తెప్పోత్సవాలు జరిగే ప్రదేశాలను సందర్శించారు. చక్రస్నానం వద్ద భక్తుల సౌకర్యార్థం జల్లుస్నానం ఏర్పాటుచేయాలని భక్తులు కోరారు. దీనిపై సముద్రం వద్దకు ఆర్డీవో వెళ్లి పరిశీలించారు.



ప్రత్యేక అకర్షణగా నిలిచిన పూలతో అలకరించిన జగ్గు

అన్ని ప్రాంతాలకు ఆదర్శంగా

యానాం ఉత్సవాలు

- అట్టహాసంగా ప్రారంభమైన యానాం ప్రజా ఉత్సవాలు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

యానాం, జనవరి 6: యానాం నియోజక వర్గంలో కొన్ని సంవత్సరాలుగా ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యానాం ప్రజాఉత్సవాలు ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచాయని పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు అన్నారు. పుదుచ్చేరి పర్యాటకశాఖ, యానాం ప్రజలస్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్తంగా ఈకార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా రు. శనివారం సాయంత్రం స్థానిక పరిపాలనాధికారి మునిస్వామి అధ్య క్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీప్రత్యేకప్రతినిధి మల్లాడి కృష్ణారావు హాజరై ఉత్సవాలను లాంఛనంగా ప్రారంభించి అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 24సంవత్సరాలకు క్రితం యానాం ఫలపుష్ప ప్రదర్శన, 22 సంవత్సరాల క్రితం యానాం ప్రజాఉత్సవాలు ప్రారంభమయ్యాయని, అయితే మధ్యలో రెండుసంవత్సరాలు కరోనా ఇతర కారణాలతో వాయిదా పడటంతో ప్రస్తుతం 22వ ఫలపుష్ప ప్రదర్శన, 20వ యానాం ప్రజాఉత్సవాలు జరుపుకుంటున్నామన్నారు. యానాంలో ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాకే పుదుచ్చేరి, కారైకాల్, మహేలో ఉత్సవాలను ప్రభుత్వం నిర్వహించిందన్నారు. యానాం ఉత్సవాల ప్రేరణతోనే కోనసీమ, కాకినాడ, విశాఖపట్నం బీచ్ ఉత్సవాలు ప్రారంభించారన్నారు. సంక్రాంతి ముందుగానే ఈ ఉత్సవాలతో యానాంలో పండుగ వాతావరణం తీసుకురావాలనే ఉద్దేశంతో స్థానికంగా ఉన్న కళాకారులతోపాటు దేశ, విదేశాలకు చెందిన కళాకారులు ప్రదర్శనలను ఇస్తున్నారన్నారు. అనంతరం మల్లాడని ఆర్ఏ మునిస్వామి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆరుల్ ప్రగాశం, ఎస్‌పి రఘునాయగం, వ్యవసాయశాఖ డీడీ శివ సుబ్రహ్మణ్యం తదితరులు హాజరయ్యారు. ఈ ఉత్సవాలకు స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ హాజరుకాలేదు.



ప్రజాఉత్సవాలను ప్రారంభిస్తున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా నిర్వహించిన పలుసాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ముందుగా ఈ ఉత్సవాలను పురస్కరించిన శాస్త్రీయ, సిని మా నృత్యపోటీలను నిర్వహించారు. ముఖ్యంగా విశాఖపట్నంకు చెందిన విక్టరీ ఈవెంట్‌మేకర్స్ అధినేత మేడిద విక్టర్ నేతృత్వంలో జబర్దస్త్ ఫేమ్ వినోదిని, రాజమౌళి యాంకరింగ్ అందరినీ ఉత్తేజపరిచింది. ఒడిస్సా సంబల్‌పూరి ఫోక్ డ్యాన్స్, పైకా నృత్య ప్రదర్శనలు, మిమిక్రీ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభం

యానాం, జనవరి 6: స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో గత 21 సంవత్సరాలుగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న 22వ ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభమైయింది. క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న ప్రజాఉత్సవాలకు హాజరైన పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఆర్ఏ మునిస్వామి, ఎస్పీ రఘునాయగం, వ్యవసాయశాఖ డీడీ శివ సుబ్రహ్మణ్యం తదితరులు హాజరై ఈ ఫలపుష్ప ప్రదర్శన ప్రారంభించి అనంతరం తిలకించారు. ఈ ప్రదర్శన శనివారం నుంచి సోమవారం వరకూ మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఫలపుష్పప్రదర్శనలో స్థానిక వ్యాపార సంస్థలకు సంబంధించి స్టాల్స్‌ను ఏర్పాట్లు చేశారు.

సత్యదేవుడిని దర్శించిన మిజోరం గవర్నర్



మిజోరం గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న దేవస్థానం పీఆర్వో

అన్నవరం, జనవరి 6: సత్యదేవుడి తొలిపావంచా వద్ద శనివారం మిజోరం గవర్నర్ కంభంపాటి హరిబాబు స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. ఆయనకు ఆలయ పీఆర్వో దామెర కృష్ణారావు ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం పీఆర్వో వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. ఆయన వెంట పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఉన్నారు. కార్యక్రమంలో ఏపీఆర్వో ఎం.గణపతిరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్ తదితరులు ఉన్నారు.



ప్రమాదంలో కాలి బూడిదైన బోటు



మృతదేహంను వెలికితీసి అంబులెన్స్‌లో తరలిస్తున్న దృశ్యం

దరియాలతిప్పలో

బోట్లో అగ్నిప్రమాదం

బోటు యజమాని తమ్ముడు సజీవ దహనం

యానాం, జనవరి 6: యానాం శివారు దరియాలతిప్పలోని గోదావరి ఒడ్డున ఉన్న జెట్టిలో మత్స్యకారుల బోటులో శనివారం అగ్నిప్రమాదం జరిగింది. ఈప్రమాదంలో ఒకరు సజీవ దహనంకాగా మరొకరు గాయాల పాలయ్యారు. ఐ.పోలవరం మండలం భైరవపాలెం గ్రామానికి చెందిన కామాడి నాగేశ్వరరావుకు చెందిన బోట్లో ఐస్, డీజిల్ తరలించే నేపథ్యంలో ఇంజన్ స్టార్ట్ చేస్తున్న సమయంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఈ ప్రమాదంలో బోటు యజమాని తమ్ముడు కామాడి గంగాద్రి(40) మంటలు ఆర్పేందుకు ప్రయత్నించి ప్రమాదంలో చిక్కుకొని సజీవ దహనమయ్యాడు. యానాం, ఆంధ్రప్రదేశ్, ఓఎన్జీసీ అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేసి మృతదేహాన్ని వెలికితీశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పుదుచ్చేరి ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు సహాయక చర్యలను పర్యవేక్షించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యానాం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. బోటు విలువ సుమారు 40లక్షల వరకు నష్టం ఉంటుందని యానాం అగ్నిమాపక సిబ్బంది అంచనా వేస్తున్నారు.

బోటు ప్రమాదంలో భైరవపాలెం వాసి..

ఐ.పోలవరం: యానాం దరియాలతిప్ప బోటు అగ్నిప్రమాదంలో బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం భైరవపాలేనికి చెందిన కామాడి గంగాద్రి సజీవదహనమయ్యాడు. దరియాలతిప్ప జెట్టీవద్ద బోటుకు మరమ్మతులు చేస్తుండగా మంటలు వ్యాపించడంతో ప్రమాదం జరిగింది. గంగాద్రికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కుటుంబ యజమాని చనిపోవడంతో అనాథలమయ్యామంటూ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు.



మృతుడు కామాడి గంగాద్రి

విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తనిఖీలు



ఏలేశ్వరంలో పీడీఎస్ బియ్యం పట్టుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

ప్రత్తిపాడు, జనవరి 6: రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించి 40 బ్యాగుల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. కాకినాడ జిల్లా ఏలేశ్వరం రెల్లివీధిలో పాత షాపింగ్‌కాంప్లెక్స్‌లో బియ్యం అక్రమ నిల్వలకు సంబంధించిన సమాచారం మేరకు విజిలెన్స్ రెవెన్యూ, సివిల్ సప్లయి అధికారులు తనిఖీలు చేపట్టారు. 40 బ్యాగులలో సుమారు 2వేల కిలోల పీడీఎస్ బియ్యాన్ని గుర్తించారు. మన్యం రవితేజ అనే వ్యక్తి పీడీఎస్ బియ్యం కిలో రూ.20లు వంతున రేషన్‌కార్డులవద్ద కొనుగోలుచేసి రూ.23లు చొప్పున ఇటుక కార్మికులకు విక్రయిస్తున్నాడు. ఈ బియ్యానికి సంబంధించి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో రూ.94వేలు గల బియ్యాన్ని, ఎలక్ట్రానిక్ తూకాన్ని సీజ్‌చేసి 6ఏ కింద కేసు నమోదు చేశారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేసిన మన్యం రవితేజపై క్రిమినల్ కేసులు నమోదు కోసం పోలీస్‌స్టేషన్‌కు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎ. సురేష్‌బాబు మాట్లాడుతూ తమ పరిధిలోని 3 జిల్లాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ నిల్వలు, రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఎవరైనా పీడీఎస్ బియ్యం కొనడం, అమ్మడం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుటామన్నారు. ఇన్‌స్పెక్టర్ పి.నాగవెంకటరాజు సబ్‌ఇన్‌స్పెక్టర్ జగన్నాధరెడ్డి, ఏలేశ్వరం సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ సాయికిరణ్, కానిస్టేబుల్ వల్లి, వీరబాబు పాల్గొన్నారు.

కారును ఢీకొని మోటార్ సైకిలిస్టు మృతి

- మహిళకు తీవ్ర గాయాలు
- కారుకు మోటార్ సైకిల్ హ్యాండిల్ తగలడంతో ప్రమాదం

గండేపల్లి, జనవరి 6: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో రామేశ్వరంపేట ఏడీబీ రోడ్డులో ప్రగతి కాలేజీ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాకినాడ జగన్నాధపురానికి చెందిన చింతా ఆదినారాయణ (29)మృతి చెందగా, మహిళకు గాయాలయ్యాయి. పోలీసుల సమాచారం ప్రకారం... చింతా ఆదినారాయణ ఒక మహిళ మోటార్ సైకిల్‌పై పెద్దాపురంవైపు నుంచి రాజమహేంద్రవరం వెళుతుండగా రామేశ్వరంపేట ప్రగతి కాలేజ్ దగ్గరికి వచ్చేసరికి రాజమహేంద్రవరం నుంచి పెద్దాపురం వైపు వస్తున్న కారుకు మోటార్ సైకిల్ హ్యాండిల్ తగలడంతో ముందు వస్తున్న మరో కారుపై పల్టీలు కొట్టి పక్కనే ఉన్న మరోకారుపై పడడంతో ఆదినారాయణ తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందగా వెనుక ఉన్న మహిళకు తీవ్ర గాయాలు కావడంతో వారిని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. మహిళ పేరు తెలియాల్సి ఉందన్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ ఎస్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చింతా ఆదినారాయణ, సంఘటనాస్థలంలో ఉన్న కారు

ప్రపంచంలోనే తొలిసారిగా ఫార్మసీ విద్యార్థులకు వర్చువల్ ల్యాబ్ 3డీ

రాజమహేంద్రవరం, జనవరి 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే తొలిసారిగా బీ.ఫార్మసీ విద్యార్థుల కోసం 'వర్చువల్ ల్యాబ్ 3డీ'ని రూపొందించామని యూకే కేంద్రంగా పనిచేస్తున్న ఇన్ఫోప్లస్ టెక్నాలజీస్ డైరెక్టర్ జీవీహెచ్ ప్రసాద్ పేర్కొన్నారు. దివాన్‌చెరువు వీజేస్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో 'ఫార్మాస్యూటికల్ పరిశోధనల్లో ఇటీవల వృద్ధి, సవాళ్లు, అవకాశాలు' అనే అంశంపై రెండు రోజులపాటు నిర్వహిస్తున్న జాతీయ సదస్సుకు ఆయన హాజరయ్యారు. వర్చువల్ ల్యాబ్ 3డీ ద్వారా ఫార్మసీలోని వివిధ అంశాలను, పాఠాలను ప్రదర్శించారు. తమ సంస్థ ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థుల కోసం ఇప్పటికే 13 ఏళ్లుగా త్రీ డైమెన్షనల్ క్లాస్ రూం లెసన్స్‌ని ఆంధ్రా, తెలంగాణతోపాటు 16 రాష్ట్రాల్లోని ప్రైవేటు, ప్రభుత్వ సంస్థలకు అందిస్తోందని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా ప్రసాద్‌ని ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మొంతు ఎం.పాటిల్ సత్కరించారు.



ప్రసాద్‌ను సత్కరిస్తున్న ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ మొంతు ఎం.పాటిల్

వెంకన్న ఆలయంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

ఆత్రేయపురం, జనవరి 6: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని శనివారం రాత్రి హైకోర్టు న్యాయమూర్తి శేషసాయి కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. అర్చక బృందం పూర్ణకుంభం, వేదమంత్రాలతో స్వాగతం పలికారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వసంత మండపంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు స్వామివారి చిత్రపటం అందజేశారు. ఈవో ముదునూరి సత్యనారాయణరాజు ఏర్పాట్లు చేశారు.

- మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు
- కొత్తపేటలో టీడీపీ కార్యాలయం ప్రారంభం
- టీడీపీలో కాపు యువకులు చేరిక

సమగ్రశిక్షా ఉద్యోగుల మోటారుసైకిల్ ర్యాలీ



మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్న సమగ్రశిక్షా ఉద్యోగులు

ముమ్మిడివరం, జనవరి 6: సమగ్రశిక్షా ఉద్యోగులు డిమాండ్ల పరిష్కారం కోరుతూ చేపట్టిన సమ్మె శనివారం నాటికి 18వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరంలోని డీఈవో కార్యాలయం ఎదుట సమగ్రశిక్షా ప్రాజెక్టు పరిధిలోని ఉద్యోగులు దీక్షా శిబిరాన్ని ఏర్పాటుచేసి దీక్షలు కొనసాగిస్తున్నారు. దీక్షా శిబిరం నుంచి వై.జంక్షన్ వరకు వారంతా మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. తమను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండు చేశారు. ఎంఈవో బొజ్జా రమణశ్రీ, ఎస్టీయూ సంఘ నాయకులు ఎస్ఎస్ మునీశ్వరరావు, యూటీఎఫ్ నాయకుడు దుర్గాప్రసాద్‌లు శిబిరాన్ని సందర్శించి సమగ్ర శిక్షా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలన్నారు. జేఏసీ నాయకులు వెంకన్నబాబు, శ్రీనివాసరావు, వెంకటరమణ, గౌతమ్ ప్రసాద్, అనూష, సత్యనారాయణ, పినిపే శ్రీనివాస్, కె.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. శిబిరంలో సీఆర్పీ జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనుబాబు, జిల్లా కార్యదర్శి ఎస్.వెంకట్, ఎంఐఎస్ కోఆర్డినేటర్స్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ఐఈఆర్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రిసోర్సు పర్సన్ల డివిజన్ అధ్యక్షుడు నాగన్న, కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, జిల్లాలోని సమగ్ర శిక్షా ఉద్యోగులు పాల్గొన్నారు.

26వ రోజు అంగన్‌వాడీల దీక్షలు



రాష్ట్ర మంత్రివర్గ సమావేశం తరహాలో డిమాండ్లు పరిష్కారం చేయాలని చర్చించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ముమ్మిడివరం, జనవరి 6: డిమాండ్ల పరిష్కార కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 26వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ప్రాజెక్టు కార్యాలయం ఎదుట శిబిరంలో పాల్గొన్నారు. రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రులు అంగన్‌వాడీల సమస్యలపై చర్చించినట్టు మాదిరిగా అంగన్‌వాడీలు చర్చలు జరిపి నిరసన తెలిపారు. సమ్మె చేపట్టి 26రోజులైనా సమస్యలు పరిష్కరించకపోవడంపై వారు తీవ్రనిరసన వ్యక్తంచేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు చేయాలని తదితర డిమాండ్లతో వారు నినాదాలు చేశారు. దీక్షా శిబిరంలో ఎం.జయలక్ష్మి, ఎస్.దుర్గామహేశ్వరి, విజయ, అనంతలక్ష్మి, జె.మౌనిక, ఎన్.సునీతదీవెన, రోజాభారతి, తలుపులమ్మ, జి.మంగాయమ్మ, శ్రీదేవి, అనంతలక్ష్మి, కనకదుర్గ, ఎం.అరుణ పాల్గొన్నారు.

మండపేట: అంగన్‌వాడీల సమ్మె శనివారం 26వ రోజుకు చేరింది. న్యాయమైన కోర్కెలు తీర్చాలంటూ అంగన్‌వాడీలు శిబిరం వద్ద ప్లకార్డులు చేత పట్టుకుని నిరసన తెలిపారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడి తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఎస్మా ప్రయోగం అప్రజాస్వామికం

ఉప్పలగుప్తం, జనవరి 6: శాంతియుతంగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా చట్టం ప్రయోగించడం అప్రజాస్వామికమని కాంగ్రెస్ పార్టీ ముమ్మిడివరం నియోజకవర్గ కన్వీనర్ గెడ్డం సురేష్‌బాబు ప్రభుత్వ వైఖరిని నిరసించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ సమస్యను పరిష్కరించకుండా సమ్మెను నిషేధిస్తూ, సమ్మె కాలానికి జీతాల్లో కోత విధించడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్యను కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలు, అన్ని రాజకీయ పార్టీలు ఖండించి, అంగన్‌వాడీలకు అండగా నిలబడాలన్నారు.

టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వంలో ప్రజల బతుకులు బాగు



మాచరమట్టలులో టీడీపీ మేనిఫెస్టోను వివరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ళ

కపిలేశ్వరపురం, జనవరి 6: రాష్ట్రంలో ప్రజల బతుకులు బాగుపడాలంటే టీడీపీ, జనసేన పార్టీల సంకీర్ణ ప్రభుత్వం రావాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శనివారం శ్రీరామపురం, మాచరమట్టలు, మాచర గ్రామాల్లో నిర్వహించిన బాబుష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి తిరిగి రాష్ట్రప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరించారు. టీడీపీ అమలు చేయనున్న మినీమేనిఫెస్టోను ప్రజలకు వివరించి వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీల సంకీర్ణ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. అనంతరం మాచరమట్టలులో ఆయన విలేకరులతో మాట్లా డారు. బీసీల ఉన్నతికి టీడీపీ ప్రభుత్వం ఏమేరకు కృషిచేసిందో అందరికీ తెలుసు అన్నారు. వైసీపీ ప్రభుత్వం కులాల వారీగా విడదీసి 56 బీసీ కార్పొరేషన్లు పెట్టి, వాటి అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని విమర్శించారు. అనం తరం శ్రీరాంపురం, మాచరమట్టలు గ్రామాల్లో పలువురు టీడీపీలో చేరగా ఎమ్మెల్యే వేగుళ్ల వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. టీడీపీ, జనసేన నాయకులు, పాల్గొన్నారు.

జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారు



వివిధ పార్టీలకు చెందిన కాపు సామాజిక వర్గం నేతలు టీడీపీలో చేరిన దృశ్యం, చిత్రంలో బండారు, అనంతకుమారి, హరీష్

కొత్తపేట, జనవరి 6: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి యువత భవిష్యత్‌ను నాశనం చేసి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు అన్నారు. శనివారం కొత్తపేటలో పార్టీ నేతలతో కలిసి ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాలరాసి తన సొంత రాజ్యాంగాన్ని రాష్ట్రంలో అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని తరిమికొట్టి రాష్ట్రాన్ని కాపాడుకోవడం కోసం ప్రజలంతా ఏకతాటిపైకి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టీడీపీ నాయకులు రెడ్డి అనంతకుమారి, గంటి హరీష్‌మాధుర్, వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ, ముత్యాల బాబ్జి, బండారు సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేటలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

కొత్తపేట, జనవరి 6: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడటంతో కొత్తపేటలో శనివారం టీడీపీ కార్యాలయాన్ని జిల్లా టీడీపీ అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి ప్రారంభించారు. పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు, పార్టీ పరిశీలకులు మందలపు రవికుమార్, వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరికలు...

కొత్తపేటలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా వివిధ పార్టీలకు చెందిన 9మంది కాపు యువకులు ఆ పార్టీలను వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి పార్టీ ఇన్‌చార్జ్ బండారు సత్యానందరావు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. ఆలమూరు మండలం చింతలూరుకు చెందిన పెద్దింటి సత్యకామేశ్వరరావు, అడపాక తేజ, దాసరి శ్రీను తదితరులు పార్టీలో చేరారు. టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మిభాస్కరరావు, వాసంశెట్టి సత్యనారాయణ, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో బీసీలకు తీవ్ర అన్యాయం

రావులపాలెం, జనవరి 6: జగన్ పాలనలో బీసీలు అణచివేతకు గురయ్యారని, జగన్‌పాలనకు స్వస్తి పలికి ప్రజాపాలనను తీసుకువచ్చే చంద్రబాబును అధికారంలోకి తీసుకురావాలని మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు అండగా ఉండేది టీడీపీనన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక బీసీలకు రక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. బీసీలకు జరిగే అన్యాయాలను వివరించి వారిలో చైతన్యం తీసుకురావడానికి టీడీపీ జయహో బీసీ కార్యక్రమాన్ని తీసుకువచ్చిందన్నారు. జగన్ ప్రభుత్వం 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని ప్రచార ఆర్భాటం తప్ప నిధులు ఇచ్చి వారికి అండగా నిలబడింది లేదన్నారు. బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి వైసీపీని తరిమికొట్టాలన్నారు. సమావేశంలో గుత్తుల పట్టాభిరామారావు, కాసా సాగర్, డొమ్మేటి శ్రీను, కోట వెంకటేశ్వరరావు, కడలి లచ్చన్న, అత్తిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాలబాలాజీ ఆదాయం రూ.2,26,335

మామిడికుదురు, జనవరి 6: అప్పనపల్లి బాలబాలాజీ స్వామికి వివిధ ఆర్జిత సేవల ద్వారా శనివారం రూ.2,26,335 ఆదాయం వచ్చిందని ఆలయ ఏసీ జి.మాధవి తెలిపారు. దేవస్థానం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామివారిని 3,085మంది భక్తులు దర్శించుకుని, 2,269మంది అన్నప్రసాదం స్వీకరించారన్నారు. భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఏసీ మాధవి, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. అప్పనపల్లి బాలబాలాజీ స్వామి నిత్యాన్నదాన పథకానికి ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి గ్రామానికి చెందిన తాడేపల్లి శ్రీహరిరావు రూ.50,001 విరాళంగా అందించారు.

శనేశ్వరస్వామి ఆలయంలో పూజలు

కొత్తపేట, జనవరి 6: మందపల్లి మందేశ్వర (శనేశ్వరస్వామి) ఆలయానికి శనివారం భక్తులు విచ్చేసి స్వామివారి సర్వదర్శనాల అనంతరం తైలాభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అటవీ శాఖ మాజీ మంత్రి సిద్దా రాఘవరావు కుటుంబ సభ్యులతో ఆలయానికి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రం చిత్రపటం అందించి వేదాశీర్వచనం అందించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు రూ.70,844 ఆదాయం లభించగా అన్నప్రసాద విరాళం రూ.15,986 వచ్చినట్లు ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు.

కాలినడకన తిరుమలకు

అమలాపురంరూరల్, జనవరి6: బండారులంక దంగేటివారిపాలేనికి చెందిన రాయుడు సింహాద్రి అప్పన్న స్థానిక పద్మావతి అలివేలు మంగా సమేత శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం శనివారం ఉదయం తిరుమలలోని కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు కాలినడకన బయలుదేరారు.

నగర పంచాయతీ, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మె



మండపేటలో వంటావార్పు చేస్తున్న కార్మికులు

ముమ్మిడివరం, జనవరి 6: డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ అవుట్‌సోర్సింగ్, ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె శనివారం 12వ రోజుకు చేరుకుంది. డిమాండ్లు పరిష్కరించాలని వారంతా నగర పంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో ఖాళీ కంచాలపై గరిటెలతో మోగిస్తూ నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండు చేశారు. ఎలక్ట్రికల్, తాగునీటి సరఫరా, పారిశుధ్య పనులు నిలిపివేశారు. సీఐటీయూ నాయకుడు జి.దుర్గాప్రసాద్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. శిబిరంలో ఎం.శ్రీనివాసరావు, ఎన్.అరుణ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.అజయ్‌కుమార్, ఎన్.వెంకటేష్, కాకి రాంబాబు, బి.లోవరాజు, ఎం.భార్గవ్, నాగలక్ష్మి, వెంకటలక్ష్మి, బి.శ్రీను, నాగమ్మ, వై.రమణ, ఎస్.రామరాజు, సీహెచ్ వెంకటేశ్వరరావు, అర్జావతి, పి.రమణమ్మ పాల్గొన్నారు.

రామచంద్రపురం: మున్సిపల్ కార్మికుల సమ్మె రామచంద్రపురంలో 4వ రోజుకు చేరుకుంది. శిబిరాన్ని సీనియర్ మున్సిపల్ కార్మికుడు బండి అప్పారావు, పెద్దిరెడ్డి రాము ప్రారంభించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. వడ్డాది సత్తిబాబు, వడ్డాది రాజు, ఎం.గణపతి, మీసాల గోపి, కార్మికులు పాల్గొన్నారు.

మండపేట: ప్రభుత్వం న్యాయబద్ధమైన కోర్కెలు తీర్చే వరకుసమ్మె ఆపే ప్రసక్తిలేదని ఒప్పంద పారిశుధ్య కార్మికులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండపేటలో కార్మికులు శిబిరం వద్ద వంటావార్పు చేసి వినూత్నంగా నిరసన తెలిపారు.

పెంచిన పెన్షన్‌తో 14,219మందికి లబ్ధి

అమలాపురం రూరల్, జనవరి 6: పెన్షన్ కానుకను రూ.3 వేలుకు పెంచి ఈనెలనుంచి అందించనున్నట్లు మంత్రి పినిపే విశ్వరూప్ చెప్పారు. మండలంలో 14,219మంది పెన్షన్‌దారులకు రూ.130.20కోట్ల మేర లబ్ధి చేకూరుతుందన్నారు. అర్హులైన ప్రతీఒక్కరికీ పెన్షన్ అందిస్తామన్నారు. కామనగరువు సచివాలయం-2 వద్ద శనివారం జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ నక్కా అరుణకుమారి అధ్యక్షత వహించగా ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, బొంతు గోవిందుశెట్టి, రాజులపూడి భాస్కరరావు, సర్పంచ్ దాసరి అరుణ, రాజులపూడి మురళీ, కార్యదర్శి ఏఎస్‌వీఎస్ రాజేశ్వరరావు(రాజా), పి.ఆదినారాయణ, నక్కా చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదును పరిశీలించిన ఏవో

రాయవరం, జనవరి 6: వి.సావరంలో శనివారం దాళ్వాపంట నమోదును మండల వ్యవసాయ అధికారి కె.ప్రభాకర్ పరిశీలించారు. మండలంలో 2700ఎకరాల్లో పంట నమోదు పూర్తి చేశామన్నారు. ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. ధాన్యం అమ్మకాలు సాగించేందుకు, పంట నష్టపరిహారం పొందడానికి, పంట బీమాకు అర్హత సాధించేందుకు, సున్నా వడ్డీ పొందడానికి పంట నమోదు ఉపయోగపడుతుందన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యం

పి.గన్నవరం, జనవరి 6: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమని టీడీపీ జోన్-2 పరిశీలకుడు మందలపు రవికుమార్ అన్నారు. పి.గన్నవరంలో నియోజకవర్గ పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీ విజయానికి నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం పార్లమెంటరీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాధుర్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, నియోజకవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబులతో కలిసి నియోజకవర్గ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తోలేటి సత్తిబాబు, చిట్టూరి శ్రీనివాస్, దంతులూరి శ్రీనివాసరాజు, మొల్లేటి శ్రీనివాస్, మద్దాల సుబ్బారావు, సంసాని పెద్దిరాజు, గణపతి వీరరాఘవులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిల కోసం విజయవాడలో ధర్నా

అమలాపురం టౌన్, జనవరి 6: ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వంలో చలనం లేకుండా పోయిందని రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతిబసు ఆవేదన వ్యక్తం చేశారు. ఆగస్టు 24న జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో అధికారులు సెప్టెంబరు నెలలో ఆర్థిక బకాయిలను చెల్లిస్తామని హామీ ఇచ్చారని, ఇంత వరకు అమలుకు నోచుకోలేదన్నారు. అమలాపురం ఎంప్లాయీస్ హోంలో శనివారం జరిగిన సమావేశంలో జ్యోతిబసు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.18,096 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రతీ నెల 1వ తేదీన జీతాలు చెల్లించని కారణంగా ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం పట్టించుకోపోవడం శోచనీయమన్నారు. బకాయిలు చెల్లించడంతో పాటు 1వతేదీన జీతాలు చెల్లించాలన్న ప్రధానడిమాండ్లతో చేపట్టిన ఆందోళనల్లో భాగంగా ఈనెల9,10 తేదీల్లో విజయవాడలో 36గంటల ధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈధర్నాలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు పెంకే వెంకటేశ్వరరావు, ఎంటీవీ సుబ్బారావులతో పాటు ఎమ్మెల్సీ ఐవీ పాల్గొన్నారు.

టీడీపీ పాలన కోసం రాష్ట్ర ప్రజల ఎదురుచూపులు

రాజోలు, జనవరి 6: టీడీపీ పాలన కోసం రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. తాటిపాకలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం జగన్ రాష్ట్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి అరాచక పాలన నడుస్తుందని విమర్శించారు. ఈదుర్మార్గపు వైసీపీ పాలనను ప్రజలు తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో త్వరలో నిర్వహించబోయే రా.. కదిలి రా.. కార్యక్రమం ద్వారా ప్రజల్ని చైతన్య పరచవలసిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఈదుర్మార్గపు వైసీపీ ప్రభుత్వం వల్ల రాష్ట్రంఎలా నష్టపోయిందో ప్రజలకు తెలియచేయాలని గొల్లపల్లి పిలుపునిచ్చారు. ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు మండలాల టీడీపీ అధ్యక్షులు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్, ముప్పర్తి నాని, మొల్లేటి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పోలమూరి శ్యామ్ బాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, గుద్దటి చిట్టబ్బాయి, వలవల శేఖర్, పితాని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ వజ్రోత్సవ వేడుకల్లో మంత్రి

ఉప్పలగుప్తం, జనవరి 6: రాష్ట్రోపాధ్యాయ సంఘం వజ్రోత్సవం వాల్ పోస్టర్‌ను భీమనపల్లిలో మంత్రి పినిపే విశ్వరూప్ శనివారం ఆవిష్కరించారు. హైస్కూల్ ఆవరణలో ఎస్టీయూ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. జిల్లా కౌన్సిలర్ చిక్కం మైనర్‌బాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధిలో ఎస్టీయూ పాత్రను ప్రశంసించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు పెయ్యల రాజ్‌కుమార్, జిన్నూరి వెంకటేశ్వరరావు, జొన్నాడ శ్రీదుర్గ చిన్నా, జడ్పీటీసీ గెడ్డం సంపదరావు, ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు వై.శ్రీనివాస్, నూకల రుష్యేంద్రకుమార్, ఎంఈవోలు కిరణ్‌బాబు, సత్తి సత్యకృష్ణ, హెచ్ఎం నూకల సత్యనారాయణ, జిల్లా కౌన్సిలర్ సూదా రామారావు, వెలిగట్ల రత్నకుమారి, కీర్తిబాల, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

పాణింగపల్లి సొసైటీ భవనం ప్రారంభం

కె.గంగవరం, జనవరి 6: పాణింగపల్లి, సత్యవాడ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సొసైటీ, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, సచివాలయాల ప్రారంభోత్సవాలు జరిగాయి. పాణింగపల్లిలో రూ. 30లక్షలతో నిర్మించిన సొసైటీ భవనాన్ని డీసీసీబీ చైర్మన్ ఆకుల వీర్రాజు ప్రారంభించారు. సత్యవాడలో సచివాలయ భవనం, విలేజ్‌హెల్త్‌క్లినిక్‌ను ఎంపీపీ పంపన నాగమణి సుబ్బారావు, జడ్పీటీసీ ఓబిళినేని శ్రీవరలక్ష్మి రాజ్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కాకినాడ సొసైటీ బ్యాంకు సీఈవో నరసింహరావు, గంగవరం బ్రాంచి మేనేజరు రాజు, వైస్ ఎంపీపీ నీతిపూడి మధుబాల కొండ, సర్పంచ్‌లు చీకట్ల సునీత గోపాలం, సలాది సూర్యకళావతి వెంకన్న, సలాది అర్జునరావు, రెడ్డి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

కాటన్ బ్యారేజీ రోడ్డుకు మరమ్మతులు

ఆత్రేయపురం, జనవరి 6: ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్‌బ్యారేజీ మరమ్మతు పనులకు శనివారం ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి శ్రీకారం చుట్టారు. ధవళేశ్వరం నుంచి విజ్జేశ్వరం వరకూ బ్రిడ్జిపై రహదారి నిర్మాణ పనులు చేపడుతున్నారు. బొబ్బర్లంక పరిధిలో రహదారి మరమ్మతు పనులకు రూ.20లక్షలు కలెక్టర్ మంజూరు చేశారు. పేరవరంలో 203మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారు. రూ.61.80లక్షలతో నిర్మించిన సచివాలయం, ఆర్బీకే భవనాలను ఆయన ప్రారంభించి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పీటీసీ బోణం సాయిబాబా, ఏఎంసీ మాజీ చైర్మన్ ముదునూరి రామరాజు, ఆప్కాస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్, మాజీ సర్పంచ్ రాయి వెంకటేశ్వరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు దాసరి రామాంజనేయులు, స్థానిక సర్పంచ్ గంటి విజయభారతి, పాలా నాగేశ్వరరావు, గారపాటి గంగారామ్‌చౌదరి, కొల్లిశ్యామ్‌సన్, ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దార్ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు టీడీపీతోనే సాధ్యం

అంబాజీపేట, జనవరి 6: పేదలకు సంక్షేమ పథకాల అమలు టీడీపీతోనే సాధ్యమని తెలుగుదేశం పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ గణపతి వీరరాఘవులు అన్నారు. మాచవరం పరిధిలో కన్వీనర్ సత్యాల కొండలరావు ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి ఇంటింటికి బాండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గుడాల ఫణి, క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగాబత్తుల వెంకటసుబ్బారావు, కొల్లూరి దివాకర్, కత్తుల బాబులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: హాయ్ నాన్న
వెంకటరమణ	: కపాలదీవి
శ్రీలలిత	: యానిమల్
శేఖర్ స్క్రీన్-1	: రాఘవరెడ్డి
శేఖర్ స్క్రీన్-2	: ఆక్వామెన్
రమా	: డెవిల్
గణపతి	: ఎక్స్‌ట్రార్డనరీ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సలార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

ఒకే సారి ఒకే చోట..

అమలాపురం రూరల్, జనవరి 6: కామనగరువు సచివాలయం-2 వద్ద శనివారం ఒకేసారి ఒకేచోట ఏర్పాటుచేసిన తొమ్మిది శిలాఫలకాలను మంత్రి పినిపే విశ్వరూప్ ఆవిష్కరించారు. గ్రామంలో ఎని మిది అభివృద్ధి పనులు పూర్తి కాగా వాటికి ఒక్కొ క్కటి చొప్పున ఎనిమిది శిలాఫలకాలను ఏర్పాటు చేయగా నాలుగు ఓహెచ్ఎస్ఆర్‌ల నిర్మాణం కోసం మరో శిలాఫలకాన్ని ఉంచగా వాటన్నింటినీ ఒకటి తరువాత ఒకటి మంత్రి విశ్వరూప్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నక్కా అరుణ కుమారి, దాసరి అరుణ, ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, ఎంపీడీవో జె.వెంకటేశ్వరరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ కోఆర్డినేటర్‌గా విప్పర్తి బాధ్యతల స్వీకరణ

గైర్హాజరైన పలువురు నాయకులు, అలకవీడని ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం, జనవరి 6: వైసీపీ పి.గన్నవరం నియోజకవర్గం ఇన్‌చార్జిగా శనివారం విప్పర్తి వేణుగోపాలరావు బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అనంతరం మామిడికుదురు మండలంలో పర్యటించారు. ఈకార్యక్రమానికి నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు గైర్హాజరయ్యారు. ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఇంకా అలకవీడలేదు. నాలుగు రోజులుగా ఆయన అధికారిక, పార్టీ కార్యక్రమాలను రద్దు చేసుకున్నారు. ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.

నిరుద్యోగ యువతను వంచించిన జగన్

ఐ.పోలవరం, జనవరి 6: ఏటా జాబ్ క్యాలండర్ పేరుతో నిరుద్యోగ యువతను జగన్ వంచించారని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్ రాజు ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు క్యాంపు కార్యాలయం వద్ద శనివారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్ర సమయంలో నిరుద్యోగులకు భ్రమలు కల్పించిన జగన్ యువత జీవితాలతో ఆడుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ హయాంలో అయిదు లక్షల ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. చంద్రబాబు మాత్రమే నిరుద్యోగ యువతకు న్యాయం చేస్తారన్న నమ్మకంతో యువత తెలుగుదేశం పార్టీని గెలిపించేందుకు కృతనిశ్చయంతో ఉన్నారని అన్నారు. సమావేశంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాకర్లపూడి రాజేష్, ఉపాధ్యక్షుడు కాశి నరేష్‌బాబు, మద్దాల రాజు, దంతులూరి వాసురాజు, పెసంగి నాగబాబు, తెలుగు యువత అధికార ప్రతినిధి షేక్ ఇక్బాల్ అహ్మద్, పిన్నమరాజు శివ, మద్దిరెడ్డి కుమార్, బొంతు ప్రసాద్, కాశి జ్యోతిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సివిల్ జడ్జిగా వెంకటేశ్వరరావు నియామకం

రామచంద్రపురం, జనవరి 6: రామచంద్రపురం సీనియర్ సివిల్ జడ్జిగా కె.వెంకటేశ్వరరావు నియమితులయ్యారు. శనివారం స్థానిక సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఆయనబాధ్యతలు స్వీకరించారు. బార్‌అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవుసాయి ప్రసాద్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. బెంచ్‌అండ్ బార్‌అసోసియేషన్ మధ్య సహృద్భావం నెలకొల్పాలని జడ్జి న్యాయవాదులను కోరారు. బార్ ఉపాధ్యక్షుడు డి.ఎస్.ఎస్.శర్మ, పలివెల సత్యనారాయణ, చిన్నం వీర్రెడ్డి, పిల్లా పృధ్వీ, సీనియర్ న్యాయవాదులు డి.పి.శాస్త్రి, సుబ్బారావు, టి.చలపతి, లకాని కమలకు మారి, తారకేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

రెడ్డిపల్లి పంటకాల్వకు నీరివ్వండి

ఉప్పలగుప్తం, జనవరి 6: అమలాపురం ఇరిగేషన్ సెక్షన్ పరిధిలోని రెడ్డిపల్లి పంటకాల్వకు తక్షణం సాగునీటిని విడుదల చేసి దాళ్వా సాగుకు సహకరించాలంటూ ఆ ప్రాంత రైతులు మంత్రి పినిపే విశ్వరూప్‌ను అభ్యర్థించారు. శనివారం ఉద్యానవన విశ్వవిద్యాలయ బోర్డు డైరెక్టర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, మండల రైతు సలహా మండలి చైర్మన్ మానే శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రైతులు సాగునీటి సమస్యపై మంత్రికి వివరించారు. వెంటనే మంత్రి ఇరిగేషన్ డీఈఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను తక్షణం పరిష్కరించాలని ఆదేశించారు. ఈనెల8వ తేదీ మధ్యాహ్నానికి కాల్వకు నీరు అందిస్తామని డీఈఈ వివరించారని మంత్రి రైతులకు తెలిపారు. జంపన బాపిరాజుతో పాటు పలువురు రైతులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

నేడు కాంగ్రెస్ పార్టీ సమాలోచన సమావేశం

ముమ్మిడివరం, జనవరి 6: రాజ్యాంగ వ్యవస్థను బీజేపీ నిర్వీర్యం చేస్తుందని, రాజ్యాంగ పరిరక్షణకు ప్రజాస్వామిక సెక్యులర్ శక్తులు ఐక్యంగా కలిసి పోరాడాలని కాంగ్రెస్ పార్టీ సమాలోచన సమావేశాలు నిర్వహిస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఎస్సీ విభాగ చైర్మన్ వడ్డి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈనెల2 నుంచి ఇండియా కూటమిని బలపరిచే రాజకీయ పక్షాలు, ప్రజాస్వామిక సంఘాలతో కాంగ్రెస్‌పార్టీ సమావేశాలు నిర్వహిస్తుందన్నారు. ఆదివారం అమలాపురం పట్టణంలోని ముస్లిం షాదీఖానాలో సమాలోచన సమావేశం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ మాజీ కేంద్రమంత్రి జేడీ శీలం, వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ ఉపాధ్యక్షుడు కె.వినయ్‌కుమార్‌లతో పాటు పలువురు పాల్గొంటారన్నారు. అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సిద్ధివినాయక ఆలయంలో జడ్పీ చైర్మన్ పూజలు

అయినవిల్లి, జనవరి 6: అయినవిల్లి శ్రీసిద్ధి వినాయకస్వామిని శనివారం జడ్పీ చైర్మన్, పి.గన్నవరంనియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి విప్పర్తి వేణుగోపాల్ దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్నారు. కేశవస్వామి, వీరేశ్వరస్వామి, కాలభైరవస్వామి ఆలయాలను ఆయన దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ గుత్తాల నాగబాబు, నంబూరి శ్రీరామచంద్రరాజు, వెంకన్నబాబురాజు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి పాల్గొన్నారు.

బెదిరింపులకు భయపడేది లేదు: అంగన్‌వాడీలు

మామిడికుదురు, జనవరి 6: ప్రభుత్వం బెదిరింపులకు భయపడేది లేదని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. డిమాండ్ల సాధన కోసం 26వ రోజు సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్‌వాడీలు పొర్లు దండాలు పెడుతూ నిరసన తెలిపారు. డిమాండ్ల సాధనకు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పూనుకోవడం సమంజసం కాదని, సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

పంటకాల్వను ఆధునికీకరించాలంటూ నిరసన

మామిడికుదురు, జనవరి 6: గెద్దాడ గ్రామంలోని అధ్వాన్నస్థితికి చేరిన పంట కాల్వను ఆధునికీకరించాలంటూ స్థానిక రైతులు శనివారం ఆందోళన చేశారు. పంటకాల్వ యావత్తు గుర్రపుడెక్క, వివిధ రకాల వ్యర్థాలతో అధ్వాన్నంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థాలు సాగునీరు ప్రవాహానికి అడ్డంకిగా ఉన్నాయని ఆరోపించారు. కాల్వలు ఇలా ఉంటే దాళ్వా ఎలా పండించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు. పంటకాల్వను ఆధునికీకరించి సమస్యను పరిష్కరించాలంటూ డిమాండు చేశారు.

జాతీయ శిక్షణకు వెంకట్రావు



ఐ.పోలవరం, జనవరి 6: జి.వేమవరం జడ్పీ హైస్కూల్ ఫిజిక్స్ టీచర్ యు.వెంకట్రావు రీజనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మైసూర్‌లో జరిగే జాతీయ శిక్షణకు ఎంపికయ్యారు. కోనసీమ జిల్లానుంచి యు.వెంకట్రావు ఎంపిక పట్ల డీఈవో విమలకుమారి, జిల్లా సైన్స్ అధికారి జి.సుబ్రహ్మణ్యం, ఎంఈవో కొండారెడ్డి వెంకటేశ్వరరావు, హెచ్ఎం వెంకటరమణ అభినందించారు.

యానిమేటర్ల సమస్యలు పరిష్కరించాలి

రాయవరం, జనవరి 6: యానిమేటర్ల సమస్యలను పాలకులు, అధికారులు పరిష్కరించాలని యానిమేటర్ల సంఘం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షురాలు(ఏఐటీయూసీఅనుబంధం) ఎం.శ్రీదేవి కోరారు. శనివారం వెదురుపాకలో ఆమె మాట్లాడుతూ యానిమేటర్లకు కనీసవేతనం అమలు చేయాలని, ఇన్సూరెన్స్, యూనిఫాం, ఐడీ కార్డులు, 5జీ మొబైల్ వంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ ఇటీవల సెర్ప్ సీఈవో ఇంతియాజ్‌కు వినతిపత్రం అందజేసినట్లు ఆమె తెలిపారు.

అధికార పార్టీకి గుబులు పుట్టిస్తున్న మేనిఫెస్టో

ముమ్మిడివరం, జనవరి 6: తెలుగుదేశం పార్టీ సూపర్-6 పథకాలు అధికార పార్టీలో గుబులు పుట్టిస్తున్నాయని మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ గొలకోటి దొరబాబు పేర్కొన్నారు. అనాతవరంలోని వనచర్లవారిపాలెంలో భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ-జనసేన కూటమిలో అమలుచేసే పథకాల గురించి వివరించి గ్యారంటీ బాండ్లను అందజేశారు. చంద్రబాబు-పవన్‌కల్యాణ్ జనరంజక పథకాల కోసం ప్రజలు టీడీపీ-జనసేనలను గెలిపించాలని కోరారు. అందే శ్రీను, కురసాల శివబాబు, వనచర్ల సత్యనారాయణ, నడింపల్లి శ్రీనివాసరాజు, కన్నిడి రమేష్ పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి గాయాలు

ముమ్మిడివరం, జనవరి 6: కొబ్బరితోటలో తేనెటీగల దాడితో గాడిలంకకు చెందిన మాజీ సర్పంచ్ వేణుగోపాలకృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. మురమళ్ల ఆసుపత్రిలో అతడు చికిత్స పొందుతున్నాడు. వేణుగోపాలకృష్ణను మాజీ ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, నాయకులు పరామర్శించారు.

వికసిత్ భారత్ సంకల్పయాత్ర

మలికిపురం, జనవరి 6: కేశనపల్లి, గుడిమెల్లంక గ్రామాల్లో శనివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర జరిగింది. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా కేంద్ర పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు నల్లి విజయకుమారి, యెనుముల నాగు, మాలే శ్రీనివాసనగేష్, అడబాల రాంబాబు, కాపిశెట్టి కనకేశ్వరరావు, నల్లి అంజలీదేవి, రాపాక సత్యనారాయణ, మేడిచర్ల చాణక్య, అడబాల వెంకన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై పోలీసుల దాడి

కాట్రేనికోన, జనవరి 6: బలుసుతిప్పలో మద్యం బెల్టు దుకాణంపై శనివారం పోలీసులు దాడిచేశారు. 42యానాం మద్యంసీసాలు స్వాధీనం చేసుకుని, దుర్గబాబును అరెస్టు చేసినట్టు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

చేనేత సమస్యలపై లోకేశ్‌కు వివరించిన చింతా

మలికిపురం, జనవరి 6: మోరి చేనేత సహకార సంఘం మాజీ అధ్యక్షుడు, డీసీసీబీ మాజీ డైరెక్టర్, చేనేత రాష్ట్ర నాయకుడు చింతా వీరభద్రేశ్వరరావు శనివారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను మంగళగిరి పార్టీ కార్యాలయంలో కలిశారు. రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, చేనేత సహకా సంఘాల మనుగడకు ప్రభుత్వాలు అందించాల్సిన రాయితీలు గురించి చర్చించినట్టు తెలిపారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేత కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని లోకేశ్ హామీ ఇచ్చినట్టు వీరభద్రేశ్వరరావు తెలిపారు.

రాష్ట్ర వ్యాప్తంగా 66.34లక్షల పింఛన్లు

అల్లవరం, జనవరి 6: రాష్ట్రవ్యాప్తంగా తమ ప్రభుత్వం 66.34 లక్షల మందికి పింఛన్లు ఇస్తుందని మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. జగన్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్ రూ.3వేలు అమలుచేస్తున్నారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అల్లవరంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన కొత్త పింఛన్ల కానుక సభ జరిగింది. చెక్‌ను మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ విడుదల చేశారు. మండలానికి 216మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయన్నారు. అనంతరం వచ్చిన ఎంపీ చింతా అనురాధ కొత్త పింఛన్‌దారులకు అభినందనలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో విశ్వరూప్‌ను గెలిపించుకోవాలంటూ ఎమ్మెల్సీ పలువురు ప్రజాప్రతినిధులు ప్రసంగించారు. జడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సాధనాల వెంకట్రావు, కొనుకు బాపూజీ, బొమ్మి బాలవేణి, దాకారపు చిరంజీవి, వడ్డి సుభాషిణి, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకటరామరాజు, ఎంపీడీవో కృష్ణమోహన్, తహసీల్దార్ ఎస్ఎస్ఎస్ ప్రసాద్, మెరికల శ్రీను, చెల్లుబోయిన శ్రీను, ఎస్.మౌనిక, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.